శ్రావణమేఘాలు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు
శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

ఇల్లు మార్చి రెండురోజులైనా కాకుండానే ఇరుగు పొరుగు అమ్మలక్కలంతా మా సరస్వతికి పరిచయస్థులైపోయారు. నాకుమటుకు ఏ ఇరుగింటాయన పొరుగింటాయన జోస్తీ కలవలేదు. పదింటిదాకా ఉదయం కిటికీవారగా కూర్చుని ఏ పుస్తకమో చదువుకోవటం, గడియారం పదీ కొట్టగానే నాలుగు మెతుకులు కతికి ఆఫీసుకుపోవటం, మళ్ళీ సాయంత్రం ఇంటిముఖం చూస్తే అప్పుడిక ఓపికుంటే అలా షికారుకుపోవటం, లేకుంటే సరస్వతి ఎదురుగుండా కూర్చుని ఆమె చేసే ప్రతిపనినీ వంకలుపెడుతూ ఆమె కోపగించుకుంటే అనునయిస్తూ ఇలా కాలం గడుపుకోవటం జరుగుతోంది.

"ఉంటే ఆఫీసు, లేకుంటే ఇల్లూ ఈ రెండూ తప్పించి మీకు..." చప్పున సరస్వతి మాటకు అడ్డుపడుతూ "నువ్వనేది బోధపడింది. మొగవాడు తిరక్క చెడ్డాడంటావు. అంతేగా?" అన్నాను.

"నన్ను చూడండి, ఎంత సులువుగా కాలం గడుపుకుంటానో."

సరస్వతి చెప్పింది నిజమే. ఎటువంటి పరిస్థితుల్లోనైనా, ఎటువంటి పరిసరాల్లోనైనా ఇట్టే ఇమిడిపోగలిగే శక్తి ఆడవాళ్ళకుంది. ఆ నేర్పు మొగవాడిలో లేదు. ఒచ్చి రెండురోజులైనా కాకుండానే అప్పుడే ఇరుగింటి పొరుగింటి వాళ్ళ అట్టుపుట్టుఆనవాళ్లన్నీ తెలుసుకోవటమే కాకుండా వాళ్ళందరి హృదయాల్లోనూ తను కొంతభాగం పంచుకుని తనహృదయంలో వాళ్లందరికీ చోటు ఇవ్వగలిగింది.

ఒచ్చిన మర్నాడే "చూశారా పాపం! మన పొరుగింటి సుందరమ్మగారు లేరూ, ఆవిడెవరో తెలుసా?" అంది సరస్వతి ఆశ్చర్యంగా.

"తెలియదు. ఎవరేవిఁటి?"

"సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు సుబ్రహ్మణ్యం పేరు ఎరగరూటండీ. ఆయన పాటకచ్చేరీలు అనేకమార్లు విన్నాం."

"అవును. అయితే నువ్వనేదేవిఁటి?"

"ఈవిడ భర్తట ఆయన."

"చాలా అదృష్టవంతురాలు. అటువంటి కీర్తిమంతుని భార్య మన పొరుగున ఉండటం మన అదృష్టం!"

"మీదంతా వేళాకోళం. ఎంత పెద్ద పేరు మోసినవాడయితే మటుకు నీతి లేకపోయింతర్వాత ఎందుకొచ్చిన పేరు. ఛీ!" కిటికీలోంచి అవతలికి ఉమ్మేసింది సరస్వతి.

"ఇంతకీ ఏవిఁటో పూర్తిగా చెప్పకుండానే పోతావేం?"

నన్ను గొప్ప సస్పెన్సులో పడేసి సరస్వతి వంటగది పొగలో అదృశ్యమైపోయింది.

సాయంత్రం మళ్ళీ తనే ఆ ప్రస్తావన తీసుకొచ్చింది. "ఉత్తి త్రాగుబోతుట. ఏ ఆరు నెల్లకో, అయిదునెల్లకో ఓమారు వస్తూంటాట్ట, సంపాదించిన డబ్బంతా పాడుచేస్తున్నాట్ట"—ఇదీ సరస్వతి చెప్పిన విషయం.

"అయితే మరి ఆవిడ సంసారం ఎలా గడుస్తున్నట్టు?"

"మనిషి చాలా తెలివైందిలెండి. పుట్టింటినించి తెచ్చుకున్న నగానట్రా ఉంటే అది కాస్తా భద్రంగా దాచుకుని వాడిచేత ఎన్ని తిట్లుతిన్నా ఎన్ని దెబ్బలు తిన్నా సహించి, ఆ నగలు అమ్ముకుని కాస్త పొలం పుట్రా కొనుక్కుని అలా కాలక్షేపం చేస్తోంది. వడ్డీ వ్యాపారంకూడా చేస్తూంటుంది. ఆ కాస్త ఆధారం అయినా లేకపోతే ఆవిడ బ్రతుకు ఏమయేదో ఆలోచించండి"—సరస్వతి ఓమారు కళ్లు తుడుచుకుంది.

"ఇలా జాలిదల్చటం ప్రారంభిస్తే నీ కన్నీరుకి అంతే ఉండదు."

"కేవలం ఆమె ఒక్కతెగురించే కాదు నే బాధపడుతుంట."

"మరెవరిగురించి?" అన్నాను.

సరస్వతి తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయింది. మాట్లాట్టంలేదు. ఇవాళ సరస్వతి మహా

ఉత్సాహంగా కనుపిస్తోంది. కారణం నేను ఊహించలేకపోయాను. అడగనూ లేదు. భోజనం చేస్తుంటే ఆమే చెప్పుకొచ్చింది. నేను క్షణం నివ్వెరపోయాను.

"నిన్న ఒకావిడ్ని గురించి చెప్పానా, ఇవాళ మరొకరిగురించి చెబుతాను వినండి. మన ఇంటి వరసలో రెండిళ్ళ అవతల ఉన్నవాళ్లు ఇవాళ ఉదయం మన పక్క ఇంట్లోకి మారారు. రాగానే ఇంటాయన ఇంటావిడచేతి దెబ్బలు ఒకటి రెండు తినేసాడు."

"అదేవిఁటి ?"

సరస్వతి పగలబడి నవ్వేసింది. ఆనవ్వు వెనకాల నమిలిమింగెయ్యాలన్నంత కసికూడా వ్యక్తంఅయింది. ఏదో తృప్తి! నాకర్థం అయింది.

"నీ ధోరణి చాలా అన్యాయంగా ఉంది."

"ఏవీఁ అన్యాయంలేదు ఈ దేశంలో ఆడాళ్ళంతా అలాంటివాళ్లయిపోతే ఎంత బాగుండును అనిపించింది నాకు."

"ఎంత అహం !" నాలో నేను అనుకున్నాను. "నువ్వు కోరే స్త్రీస్వాతంత్ర్యం ఇటువంటిదేనా ఏవిఁటి ?"

సరస్వతి కొంత ఉద్రేకాన్ని శాంతింపచేసుకుంది కాబోలు సిగ్గుపడుతున్నట్టుగా కనిపించి తల వంచుకుంది. "మనిషి సిగ్గుపట్టం మరిచిపోలేనంత కాలం భవిష్యత్తుమీద కొంత ఆశ కలిగి ఉండటానికి అవకాశం లేకపోలేదన్నమాట. చేసింది తప్పయితే పశ్చాత్తాప పట్టంమాట అలాగుంచి తప్పని గుర్తించగలిగే సంస్కారంకూడా మా మగజాతిలో లేదు. అందులో స్త్రీవిషయం అయితే ఇక చెప్పనక్కర్లేదు. ఈ యినప పాదాలు ఇలా ఎంతకాలం నిర్దాక్షిణ్యంగా కదను తొక్కుతాయో !"

సరస్వతి మళ్ళీ ముఖంలో నవ్వు మాయం చేసుకుంది. చాలా తీవ్రంగా ఆలోచనలో పడిపోయింది. ఓసారి బరువుగా నిట్టూర్చింది. జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి చిరాగ్గా రేపుకుంది. నుదుటిమీద చెమటపట్టి కుంకుమ కరిగి ముఖాన్ని కొంత భీభత్సం చేసింది. లోకంలోని స్త్రీత్వమంతా ఒక్క రూపం ధరించి పగబట్టి బుసలు కొడుతూ విరుచుక పడుతోందా అనిపించింది.

సరస్వతి చురుకయిన మెదడు ఎంత నిశితంగానైనా యోచనలు చేస్తుంది. ఎంత లోతులకైనా ఆమె దృష్టి ప్రసరించగలదు. ఏ కోణంలోనుంచైనా పరిశీలించగలదు. వయస్సు మటుకు పాతికేళ్ళే. అప్పుడప్పుడు అంటూంటుంది. "నా ఆలోచనలూ, మాటలు చాలామందికి రుచించవు. మొగవాళ్లమాట అలాగుంచి ఆడవాళ్లక్కూడా కష్టంగానే ఉంటాయి" అని.

నేననేవాణ్ణి, "అదే నీకు మరీ జాలి కలిగిస్తూంటుంది కదూ" అని.

అవునన్నట్టుగా తల ఊపుతుంది సరస్వతి. "నేనూ మనిషినేగా. నాలోనూ ఆలోచనల్ని చంపేసే ఆవేశం అప్పుడప్పుడు పనుపును చేస్తుంది" అంది ఓమారు.

"ఏం ?"

"నా సానుభూతికి కూడా దారుణం అయిన పక్షపాతం లేదూ ?"

"ఏవీఁ లేదు" అన్నాను ఖచ్చితంగానే.

"ఈ క్షణంలో నాకలా కనిపించటంలా. స్త్రీ విషయంలో నీకు అపారమయిన సానుభూతి ఉండొచ్చు. పూనుకుని కొంత త్యాగానికి నువ్వు సిద్ధపడొచ్చు. కానీ నువ్వు చేసే ప్రతి పనినీ ఛిన్నాభిన్నం చేసేసి నీ ప్రయత్నాన్ని ఆ స్త్రీయే భగ్నం చేసి విజయగర్వంతో వికటాట్టహాసం చేస్తుంది. వంటగది గుమ్మముదాటి బయట ప్రపంచాన్ని చూడలేని ప్రతి స్త్రీ ఇప్పుడాపనే చేస్తోంది. నవ్వుతూనే మగవాడు తన చుట్టూ కట్టే రాతిగోడల్లో తన సహకారం కూడా పూర్తిగా లభిస్తోంది. ఈ ఆడవాళ్లంతా ఒళ్లు తెలియకుండా తాగేసి తల గోడకేసి కొట్టుకునే పిచ్చివాళ్లు. తాగి రోడ్డువార మురుగుకాలవలో పడి దొర్లుతూ "అబ్బ! ఎంత హాయిగా ఉంది" అనుకుంటూ గొంతుకెత్తి పాడుకునేవాడ్ని చూశాను. తాగి రోడ్డుమీద దుమ్ము ముఖాన్ని పూసుకుని "ఫేసు పౌడరు రాసుకున్నాను. అందంగా లేనూ" అని నన్నడిగాడొకడు. తాగి ఇంటికి నిప్పంటించుకుని ఆ ఖలయాన్ని చూస్తూ పగలబడి నవ్వుతూ ఆర్పడానికి వచ్చిన వాళ్ళతో "ఆగవయ్యా చలి కాచుకోనీ" అనేవాడ్ని చూశాను. ఇంతకంటె మెరుగైన స్థితిలో ఏమీ స్త్రీ జాతి లేదు. వాళ్ళ అజ్ఞానానికి జాలి చూపిస్తున్న నేను మొగవాళ్ళవిషయంలోకూడా సానుభూతి లేకపోవటం దారుణంగా ఉందేమో ?"

"ఎందుకో ?"

"వాళ్లూ అజ్ఞానులేగా."

"నిన్నెలా అర్థం చేసుకోవాలో నాకు బోధపట్టంలేదు. స్వజాత్యభిమానం కలవాడ్నయితే నేననవలసినమాటది. నువ్వే అనేశావు. నన్ను నిమిత్తమాత్రుడ్ని చేసి రెండువైపుల్నించి వాదించుకుని నిర్ణయాలు చేసేస్తున్నావు".

సరస్వతి ముఖంలో నవ్వు తుఫాను వెలిసింతర్వాత కాసే నీరెండలాగుంది. ఆఫీసుకు పోతుంటే గుమ్మందగ్గర నిలబడి "పెందరాళే వచ్చేయండి" అంది.

తల ఊపి వీథిలో కొచ్చి పడ్డాను. ఇంటి ఎదురుగ్గా ఉన్న పెంకుటిల్లు తలుపులు తెరిచి ఉన్నాయి. ఉదయంకూడా తాళం వేసే ఉంది. నే వచ్చినప్పట్నుంచి ఆ యిల్లు అలా జనశూన్యంగానే ఉంది. నడికప్పుమీద అక్కడక్కడ కొన్ని పెంకులుపోయాయి. కిటికీ రెక్కలు పగిలిపోయి మేకులు ఊడిపోయి వేళ్లాడుతున్నాయి. బీటలు తీసిన అరుగుమీదా, గోడమీదా గజం ఎత్తుదాక పెరిగిన మర్రిమొక్కల్ని పదిహేనేళ్ల కుర్రాడు శక్తినంతా కేంద్రీకరించి పీకుతున్నాడు. ఏళ్ళ తరబడి, కనిపెట్టుకుని ఉండేవాళ్లు లేక చివికి జీర్ణించిపోయిన ఆ కొంప, ఏ మాత్రం జనవాసయోగ్యం కాని ఆ కొంప, కొందరికి నిలవనీడ అయిందంటే ఆ పంచని చేరినవాళ్ళ చరిత్ర తప్పకుండా సరస్వతి జాబితాలోకి ఎక్కిపోయిందన్న మాటే. సందేహం లేదు సాయంత్రం ఇంటికిరాగానే మనసుని ఉద్రేకపరిచే మరికొన్ని గాథలు నా చెవిని పడతాయి ఎంతసేపూ ఆ గాథలు వింటూండటమేనా చెయ్యగలిగిందేమైనా ఉందా?" అనిపిస్తూంటుంది నాకు.

పోస్టుమనిషి ఎదురుపడి కవరు చేతిలో పెట్టాడు. పైన దస్తూరీనిబట్టి ఆ ఉత్తరం ఎక్కడ్నుంచి వచ్చిందో పోల్చుకున్న నేను చదవకుండానే జేబులో కుక్కేశాను. దూరంగా పది గంటలు వినిపించాయి. రోడ్డుమీద జనం పల్చగానే ఉన్నారు. స్టేషన్లో రైలు వచ్చి అప్పుడే ఆగింది బజారంతా ఒక్కసారి ప్రయాణీకులతో ఇరకాటం అయిపోయింది. అందరి ముఖాలు పరిశీలిస్తున్నాను. ఎందుకో? కిళ్ళీ కొట్టువాడు ఇచ్చిన చిల్లర డబ్బులు జేబులో వేసుకుని మళ్ళీ రోడ్డుమీదకొచ్చాను.

మధ్యాహ్నం విశ్రాంతిసమయంలో జేబులో కవరుసంగతి జ్ఞప్తికి వచ్చింది తీసి చదివాను నాన్న రాశారు.

"అబ్బాయీ,

నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నీకు ఆశ్చర్యం కలగొచ్చు ఇలా రాస్తుంటే. కాని గత్యంతరం లేకపోయింది. నా మానాభిమానాన్ని చంపుకునే ఈ ఉత్తరం రాస్తున్నాను. దేముడు దయదల్చి నా ఉద్దేశం నెరవేరితే నేను లోకంలో తలెత్తుకుని తిరగలేనని నాకు తెలుసు. అయినా బెంగతో కుళ్ళిపోయి మంచం పట్టిన నీ తల్లికోసమే ఈ ఉత్తరం రాస్తున్నాను. ఆమె కోరిక తీర్చాలనే ఇలా సాహసించాను. ఇప్పటికి నెల్లాళ్ళయింది. మరీ నీరసించిపోయింది. ఎముకల పుట్ట. మంచంమీద పడుకుంటే ఆ దృశ్యం చూట్టానికి హృదయవిదారకంగా ఉంటుంది. నీ గురించే పలవరిస్తోంది ఒకటేదగ్గు. నిన్న కొద్దిగా తెరిపిచ్చింది. నిన్ను చూడాలంటూ మరీమరీ చెప్పింది.

నువ్వు చేసినపని ఈ జన్మలో కలవకుండా మన సంబంధాన్ని నిర్దాక్షిణ్యంగా తెంపివేసినా, నా కోసం కాకుండా నీ తల్లికోసం మళ్ళీ ముళ్ళువెయ్యాలని నా తాపత్రయం నా మాట తీసిపారెయ్యకు నువ్వు వ్యామోహంతో చేసినపని క్షమించతగినది కాకపోయినా నేను క్షమిస్తున్నాను. కులంకాని దాని మెళ్ళో తాళికట్టినంతమాత్రాన అది భార్య అయిపోతుందా. అయినా నీ లాంటివాళ్ళనే జీవితపర్యంతం అంటిపెట్టుకుని ఉండాలనే సిద్ధాంతానికి వాళ్ళు కట్టుబడి ఉంటారా? అంతా మోసం! అంతగా కాదూ కూడదంటే నాలుగైదు వందలు డబ్బు పడేద్దాం. దానిదారి అది చూసుకుంటుంది. నువ్వు నా మాట విని ఒచ్చేసెయ్యి. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలంటే నీకు పిల్లనెవరిస్తారనే సంకోచం నీకక్కర్లేదు. అందుకు అన్నీ సిద్ధంచేసి ఉంచాను. నీకేం! నువ్వు మొగాడివి. ఇవన్నీ కేవలం నా అభిప్రాయాలే కాదు. అమ్మకూడా ఇలాగే అంది నిన్న. నా కోసం కాకపోయినా అమ్మకోసమయినా నువ్వీపని చెయ్యక తప్పదు. తర్వాత ఏమనుకున్నా లాభంలేదు. నా కోరిక మన్నించి నీ తల్లిని దక్కించుకోగలవనే విశ్వాసంతో ఎదురుచూస్తూంటాను."

అంటూ ముగించాడు ఉత్తరం. హృదయాంతరాళంలో ఎక్కడో, ఏ మూలనో రేగిన తుఫాను చిలికిచిలికి గాలివానయి నా మనసంతా అల్లకల్లోలం చేసిపారేసింది. శరీరమంతా వ్యాపించింది. రెండు తీవ్రమయినశక్తులమధ్య మెదడు రణరంగమైపోయింది. మార్గాంతరంకోసం యోచించి నిర్ణయాని కొచ్చే వ్యవధానమూ లేదు. అటు తల్లిమీద ఏ మాత్రం అభిమానమున్నా నన్ను చెయ్యమని తండ్రి ప్రోత్సహిస్తున్న అకృత్యం దారుణమైంది. సరస్వతి నా హృదయంలో భాగం. ఆ భాగం అప్పుడే తనవంతు వాదాన్నీ, బలాన్నీ, కూడదీసుకుని సిద్ధం చేసుకుంటోంది. ఏవిటి చెయ్యటం? ఎలా ఈ ఉపద్రవాన్నుంచి బయటపట్టం. అటు తల్లిని రక్షించాలనే పట్టుదల ఎంత తీవ్రంగా అలుకుంటుందో అందుకోసం మరో జీవితాన్ని నాశనం చేయ్యాలనే తలంపుకూడా నా మనసు దరిదాపులకి రాలేకపోతోంది. నిలువెత్తు ధనం పోసినా సరస్వతి నన్ను వదులుకోనిమాట నిజమే కాని అలా పొయ్యాలనే తలంపుకే నాలో చోటు లేదు. నా కోసం ఆమె చేసిన త్యాగంకంటె ఆమె కోసం నే చేసిన త్యాగం ఏ మాత్రమూ గొప్పది కాదు. ఆమెను ఒదులుకుని నేను మరో వ్యక్తికి నా హృదయంలో చోటు ఇవ్వలేనట్టే ఆమె తన హృద

యాన్ని నాతో తప్పించి మరొకరితో పంచుకోలేను. అమ్మని వదులుకోనా? సరస్వతిని వదులుకోనా? ఏ ఒక్క రి పక్షం వహించినా మరొకర్ని వదులుకోవల్సిందే. చివరికి నిర్లిప్తంగా ఉన్నా జరిగేదదే.

మధ్యాహ్నం సెలవుపెట్టి ఇంటికి చక్కా వచ్చేశాను. పెంకుటింట్లోకి కొత్తగా వచ్చినవాళ్ళు వీథి గుమ్మంలో కూర్చుని వచ్చేపోయేవాళ్ళకేసి చూస్తున్నారు. వాళ్ళమధ్య ఓ నడివయస్సు ఆవిడ కూడా ఉంది. మిగతావాళ్ళంతా పిల్లలు. బహుశః ఆవిడే ఆయింటికి పెద్దదిక్కు అయి ఉంటుంది. లోకం దృష్టిలో అమంగళి. అలా అమాయకంగా చూస్తూ కూచుంది. ఆమె ఒడిలో పసిగుడ్డు! తలమీద వెనక్కి జారిన గుడ్డని ముందుకు లాక్కోవటంలో ఆమె ఇంకా బాగా అలవాటు పడలేదు ఇటీవలే అనాథ అయి ఉంటుంది

గుమ్మంలో సరస్వతి ఎదురుచూస్తూనే ఉంది. ఆమెను చూస్తుంటే నా మనస్సు అదోలా అయిపోతోంది. పోనీ ఆమెతో నే సంప్రదిస్తే ఏమంటుందో? ఎటువంటి సలహా ఇస్తుందో?

చెప్పలేక చెప్పాను. "ఇవాళ ఉత్తరం వచ్చిం"దని.

"ఎవరు రాశారు?"

"నాన్న"—ఆమెముఖం వివర్ణమై పోయింది. బాగా సన్నిహితంగా వచ్చేసి రెండుచేతులూ పట్టుకుని ఆతృతగా నా ముఖంలోకి చూస్తూ "మిమ్మల్నంతగా కృంగతీసిన ఆ ఉత్తరంలో విశేషాలు నేను వినొచ్చునా?" అంటూ ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"నువ్వెందుకంతగా గాభరా పడతావు సరస్వతీ."

"ఏమో! నా అదృష్టం ఎలాగుందో."

"నీకేమీ భయంలేదు సరస్వతీ. నా గురించి ఆలోచించుకుంటేనే అంతా అయోమయంగా ఉంది." అని నా జేబులో ఉత్తరం ఆమె చేతిలో పెట్టాను. ఈ ఉత్తరం చదివి నువ్వు నా తల్లిదండ్రుల్ని ఎంతగా ఏవగించుకుంటావో నాకు తెలుసు. అయినా నీకు చదువమని ఇస్తున్నాను. నువ్వు నా పరిస్థితిని బాగా అర్థంచేసుకోగలవనుకుంటాను."

తలుపుకు చారబడే ఆ ఉత్తరం ఆద్యంతం సరస్వతి చదివింది. ఆమె ముఖంలోకే చూస్తూ నిలబడ్డాను. ఏ భావమూ లేదు. నన్ను గట్టిగా హృదయానికి హత్తుకుంటూ "మీరే నిర్ణయానికొచ్చారు?" అంది.

నేను తలవంచుకున్నాను నిరుత్తరంగా. తలెత్తేసరికి ఆమె కళ్ళలో దుర్భరమైనబాధ వ్యక్తంఅయింది. అశ్రుపూరితాలయిన ఆ కళ్లని నాకు చూపించటం ఇష్టంలేక కాబోలు ముఖం పక్కకి తిప్పుకుని "అయితే ప్రయాణం ఎప్పుడు నిశ్చయించుకున్నారు?" అంది.

"నీ ఉద్దేశం ఏమిటో చెప్పు"

"నేనేమీ చెప్పను; చెప్పలేను; మీరేం చేసినా నే సహించటానికి వెనుకాడను. మీ పరిస్థితి నాకు అర్థం అయింది."

"నువ్వు నన్ను నిర్దాక్షిణ్యంగా బాధపెడతావా సరస్వతీ?"

"మీరేం చేసినా నేను సహిస్తానంటున్నాగా, నేనేమీ బాధపెట్టటం లేదుగా."

"నీతో సంప్రదిస్తే మరో మార్గాంతరం ఏదైనా కనిపిస్తుందేమో అనుకున్నాను."

సరస్వతి ఏమాటా చెప్పకుండా నే వంటగదిలోకి వెళ్ళిపోయింది. రాత్రి అన్నం తినమని ఎంత బలవంతం చేసినా నేను కంచంముందు కూర్చోలేకపోయాను. నిత్యం ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ సరదాగా భోజనం చేసేవాళ్లం. ఇవాళ దుర్భరమైన మౌనం ఇద్దర్నీ మింగేసింది. సువ్యక్తంకాని దిగులు సుడిగుండంలా చుట్టేసి ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ఆకలేస్తుందా? నేను అన్నం ముట్టుకోలేను. సరస్వతి వంటగది తలుపు గొళ్లెం వేసి ఇవతలికి వస్తుంటే "నువ్వు భోజనం చేశావా?" అన్నాను.

"అక్కర్లేదు" అంది. అవును. సరస్వతి కడుపు నిండిపోయింది దుఃఖంతో. లోకంలోని చీకటంతా మా హృదయాల్లో పేరుకు పోయింది. తన్ని గురించి తాను బాధపడుతూ ఎదుటివారిగురించికూడా బాధపడే దురవస్థకి ఇద్దరం గురయాము. లోపల రేగుతున్న బీభత్సాన్ని దాచుకుందుకు ఇద్దరం ప్రయత్నిస్తున్నాం.

సరస్వతి నన్ను ఏవగించుకుంటుందేమో! అలాటి అవకాశం తను ఇస్తున్నమాట నిజం! తెగించి నేను నీవాడిని అని చెప్పలేనప్పుడు ఆమె నన్ను శంకించి నన్ను దూరంగా నెట్టటానికి ప్రయత్నించటంలో తప్పులేదు ఆమె హృదయంలో స్థానాన్ని నా చేతులారా దూరం చేసుకుంటున్నానా? సరస్వతి నాకేమీ కాదా? తల్లి గీసిన హద్దులకోసం ఆమెకు అన్యాయం చెయ్యనా? అలా చేసి నేను సుఖపడగలనా? ఎంత అహంకారంగా ఆ ఉత్తరం రాశాడో సరస్వతికి తెలుసు. నేను "మొగవాణ్ణిట!" ఈ ఒక్క ముక్క వెనకాలా నిగూఢమై ఉన్న సంకుచితభావాన్ని వమ్ము చెయ్యగలిగే శక్తి నేను కోల్పోతే ఈ ప్రపంచంలో నేనూ మనిషినే అని చెప్పుకొని తిరగటం హాస్యాస్పదం. సభ్యతాలోకం హర్షించదు. అసలు ఎవరెలాపోతే నాకేం. నా మనసు పడే బాధని నేను

సహించలేను. నా సరస్వతిని నేను ఒదులుకోలేను. దృఢంగా అనుకున్న తర్వాత మనసు శాంతించినట్లయింది. పక్కకి చూశాను. గుమ్మందగ్గర తలుపుకి ఆనుకుని కూర్చుంది సరస్వతి. ఆలోచిస్తోంది. ఇవ్వాళ సరస్వతి ముస్తాబు చేసుకోలా. తలైనా దువ్వుకోలేదు ముఖం జిడ్డు ఓడుతోంది.

"సరస్వతీ!"

"హాఁ!"

"పొద్దు గూకింది. దీపం వెలిగించవూ?"

సరస్వతి లేచి దీపం వెలిగించి కొంకికి తగిలించింది. పూలమ్మేవాడు గుమ్మంలో నిలబడి "అమ్మగారూ!" అని పిలిచాడు.

సరస్వతి నావైపు చూసింది. అప్రయత్నంగా నా తల వంగిపోయింది. ఉన్నట్టుండి సరస్వతి చిన్నగా నవ్వటం వినిపించి తలెత్తాను. ఆమె నవ్వుతూనే "చిల్లరుంటే ఓ అణా ఇవ్వండి" అంది.

జేబులు తడుముకున్నాను. ఓ కానీ మటుకు చేతికి తగిలింది. అయిదు రూపాయలనోటు తప్పించి మరి చిల్లర లేదు.

"పోనీలెండి లేకపోతే. అక్కర్లేదు అబ్బి నువ్వెళ్ళు" అంది సరస్వతి.

పూలమ్మేవాడు వెళ్ళిపోయాడు. మళ్ళీ నిశ్శబ్దం మిగిలింది. సరస్వతి కూచున్నచోటునుంచి కదలలేదని అలికిడి కాకపోవటంవల్ల తెలుస్తూనే ఉంది. ఏం చేస్తోందో పాపం! కళ్ళు తెరచి ఓసారి చూద్దామనిపించింది. కాని భయం! ఏదో తెలియని సిగ్గు భారం! దొంగతనం చేసి పట్టుబడినప్పుడు అమ్మా, సరస్వతికీ నాకూ మధ్య ఉన్న సంబంధం తెలిసినప్పుడు నాన్నా పెట్టలేని భయం ఇప్పుడు సరస్వతి చూపులు కల్గిస్తున్నాయి. ఆ నేత్రాలలో ఎంతశక్తి! ప్రథమ సమావేశంలో "నీ కళ్ళు ఎంత చక్కనివి" అని నేను వేటిని పొగడానో అనుక్షణం ఏ నేత్రాలలోకి చూసి తన్మయత చెంది అనునిత్యం పరితపించానో ఆ కన్నులు, ఆ నయనదళ కాంతులు ఈ క్షణంలో దీపకాంతిలో భీకరంగా నావంక పరికిస్తూ ఉండి ఉండాలి.

చాలాసేపు ఇలా గడిచిపోయింది. కిటికీ తలుపులు తెరిచే ఉన్నాయి. అయినా ఉక్కబోస్తోంది. ఈతపన, హృదయంలో మంటకి తోడయి దుర్భరంగా పరిణమిస్తోంది. ఇంతసేపటికి సరస్వతి ఏమి చేస్తుందో తెలుసుకోవాలని అనిపించింది. దీపంకూడా తగ్గినట్టుంది. నాముఖంమీద కాంతి పడ్డట్టుగా అనుభూతి కలగడం లేదు. మెల్లగా కళ్ళు విప్పాను. దారుణమైన నిశ్శబ్దం! తలపక్కకు తిప్పాను. తొలికాన్పులో నే పుట్టిన పసికందును పొగొట్టుకున్న చిన్ని బాలింతరాలులా అలవాటులేని బాధని అనుభవిస్తోంది. సరస్వతి బహుశా నేను ఇంతసేపట్నుంచీ మెలకువగా నేఉన్నాననే అభిప్రాయం పొరబాటయి ఉంటుంది. నిద్రను అనుభవించకపోయినా కనీసం సమీపించి ఉంటాను. లేకపోతే నాకళ్ళముందే ఆమె లేవటం, చాపపరుచుకోవటం పడుకోవటం ఏదో కలలో జరుగుతున్నట్టుగా ఎందుకు అనిపించాలి.? శాంతమూర్తి సరస్వతి అమాయకంగా నిద్రపోతోంది. సరస్వతి నాఅభిమాన నామధేయం కాదు. ఆమెకు మొదటిలేఖ రాసినప్పుడు "మాలతి" అనే సంబోధించాను.

"నా పేరు మాలతి కాదు."

"నిన్ను నేను అలాగే పిలుస్తాను."

"అలా పిలుస్తే జవాబు ఇచ్చేది లేదు."

"సరే ఏం చేస్తాను"—ఏదో ఇష్టంలేకపోయినా తప్పనిసరయింది యీ పిలుపు. అలవర్చుకున్నాను.

దగ్గరకు వెళ్ళి తొంగి చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు కనిపిస్తోంది. ఓక్షణం సరస్వతిమీద అసూయ వేసింది. ఇంతటి సంఘర్షణలోకూడా నిద్రను అనుభవిస్తూ ఎలా సుఖాన్ని పందుకుంది? తలుపులు తెరిచే ఉన్నాయి. గాలిమటుకు వేడిగా 'గీ' పెట్టుకుంటూ వీస్తోంది. పెద్దముల్లు పన్నెండుమీదా, చిన్నముల్లు పదిమీదా ఉన్నాయి. సూర్యోదయం కావాలంటే చాలా యుగాలు గడవాలి. దుస్సహం! ఈ రాత్రి నాకు నిద్రపట్టదు. మెలకువగా ఉండలేను. సరస్వతికి నిద్రాభంగం జరకుండా అలికిడి కాకుండా వెళ్ళి మంచంమీద కూర్చున్నాను.

"అబ్బాయీ!" అని తండ్రి సంబోధన! ఉత్తరంలో కాదు. ఎదురుగా నిలిచి పిలుస్తున్నట్టుగా అనిపిస్తోంది. జవాబు చెప్పకుండా విదిలించుకొని పోగలనా? నాదీ మనస్సే! ఈ రాగద్వేషాలు అజ్ఞాతంగా ఎంత దృఢంగా బిగిస్తాయి!

"నిన్ను చూడాలంటూ మరీ మరీ చెప్పింది."

అబ్బ! నరాలు కోస్తున్నాయి! చేసినపని ప్రశంసనీయమైనదే. ఆత్మవిశ్వాసం ఉన్నా పరిస్థితులకూ, పరిసరాల ప్రభావానికీ తట్టుకోలేక క్షణక్షణానికీ లొంగిపోతూ తిరిగి దిటవు తెచ్చుకొని సర్దుకుంటూన్న ఈ సమర్థుడైన అసమర్థుడు ఈ తల్లి కడుపున జన్మించకపోయినా బాగుండిపోయేది! కనీసం ప్రేమ అనే ఊబిలోకి దిగబడకపోయినా జీవితంలో ఈ లోయలు ఏర్పడేవి కాదేమో!

ఉత్తరం అంటోంది "కాదూ కూడదంటే నాలుగైదొందలు డబ్బు పడేద్దాం" ఛీ! సంస్కారం రాక్షసుడుగా చిత్రిస్తే స్వాభిమానం, జంకుతోంది

ఎందుకో. నాకు తండ్రికంటె తల్లి సన్నిహితురాలు! తండ్రి నెత్తురు తల్లిద్వారా నాలో ప్రవేశించింది. అందుకనే తల్లి మంచంపట్టింది. తండ్రి నిబ్బరంగా ఎలా మోసంచెయ్యాలో సలహా లిస్తున్నాడు. 'నువ్వు మొగవాడివి' అంటూ సమాజం తరఫున హామీలు ఇస్తున్నాడు.

ఇక ఎటూ ఆగకుండా మనసు సముద్రమథనం ప్రారంభించింది. అర్ధాంగి మూగవేదన! ఈ తరంలోంచి మాతృమూర్తి పలవరింతలు! నాన్నగారి వ్యవహారజ్ఞానం! అసమర్థుడి ఆక్రందన!

హృదయం వెయ్యిముక్కలయినా బాగుండును అనిపించే ఈ వేగం ఎలా భరించేది?

కాని......ఎముకలు పోగుచేసి ఓ చోటుకు చేరిస్తే ఒకప్పుడు ఎంతటి సంకుచితత్వాన్ని జీర్ణం చేసుకున్నదైనా అవన్నీ కలసి ముక్తకంఠంతో 'కొడుకా!" అని విలపిస్తుంటే నా రక్తం ద్రవించిపోకుండా ఎలాగుంటుంది. ఊహించలేను. లోలోపల కమ్మరిపురుగు దొలుస్తున్నట్టుగా బాధ! ఇక ఆట్టే వ్యవధానం లేదు. అమ్మ పిలుపు దగ్గరౌతోంది.

కాని సరస్వతి దూరం కావటంలేదు.

అమ్మ ప్రాధేయపడుతోంది తుది కోరిక చెల్లించమని.

కాని సరస్వతిని దూరం చెయ్యలేకపోతున్నాను.

ఆలోచన! ఆవేదన! ఆవేశం! ఉప్పెనలా ముంచుకొస్తుంటే...లోలోపల ఓ వెర్రికేక వేసి లేచి కూర్చున్నాను.

సరస్వతి నిద్రపోతోంది. వేడిగాలి విసురుగా తోసుకొచ్చింది. సరస్వతి నిద్రలో నిట్టూరుస్తోంది. సరస్వతి పెదాలు కదులుతున్నాయి. వెనక్కి తగ్గాను. దీపం చిన్నదౌతోంది. వణుకుతూనే చూశాను. తక్కువైన వెలుతురులో చిన్నబోయింది వన్నె తగ్గిన వదనం. చూపు మరల్చుకోలేక మళ్ళీ చూశాను. అడుగు ముందుకువేశాను. దీపం రెపరెపలాడింది. గాలి 'రంయ్' మని హోరుపెడుతూంది. సరస్వతి మెల్లగా కదుల్తూంది. ఇంకో అడుగు ముందుకు వేశాను. దీపం ఆరిపోడానికి సిద్ధంగా ఉంది. సరస్వతి చెయ్యి ముందుకు మరికొంత జరిగింది. ఇక కదల్లేను. మృదువైన ఆ హస్తం ఈ ఇనప పాదాల్ని బంధించింది. నా శరీరం స్పందించింది. భావోద్వేగంతో నరాలు పీక్కుపోతున్నాయి. రక్తం ఘనీభవిస్తోంది. దీపం ఆరిపోయింది. కిటికీలోంచి మావైపే తొంగి చూస్తోంది నక్షత్రం!

చీకట్లను చీలుస్తూ హఠాత్తుగా పెద్ద కేక! మరుక్షణంలో హృదయవిదారకంగా విలపిస్తున్న ఆడగొంతు! కాళ్ళకింద భూమి కదలింది. గుండెలు జల్లుమన్నాయి. అనుకోకుండానే సరస్వతి హఠాత్తుగా లేచి నిల్చోబోయి తూలి కింద పడింది. చప్పున ముందుకు దూకి ఆమెను లేవనెత్తి "సరస్వతీ" అని పిలిచాను.

"మీరా? ఇంకా నిద్రపోలేదూ?"

"ఎందుకలా భయపడ్డావు?"

"ఏదో గావుకేక వినబడింది"

"అవును. పెంకుటింట్లోంచి వచ్చింది ఆ కేక."

"అయ్యో! ఇందాకనే వాళ్ళబ్బాయికి జబ్బుగా ఉందే. దీపం ఏదీ?"

"నువ్వు కంగారుపడకు."

"ఏం అఘాయిత్యం జరిగిందో పాపం! నేను కదల్లేకుండా ఉన్నాను. దీపం వెలిగించండి."

నేను చీకటిలోనే వెతుకులాట మొదలుపెట్టాను. చివరికి టార్చిలైటు దొరికింది. దీపంకూడా వెలిగించాను అయిదు నిముషాలు పట్టింది ఇదంతా పూర్తయేసరికి. అప్పుడు చూశాను నిట్టూర్పులతో నీరసించిన సరస్వతి ముఖం.

బయట గొళ్ళెం పెట్టి టార్చిలైటు వెలిగించి బయల్దేరాం ఇద్దరమూ. నా భుజం పట్టుకుని నడుస్తోంది పక్కగా. పెంకుటింట్లో దీపం వెలుగుతూంది. అయిదారుగురు మనుష్యులు గుమ్మందగ్గర మూగారు. కాళ్ళకి గులకరాళ్ళు గుచ్చుకుంటున్నాయి. సరస్వతిని చూసి వాళ్ళు దారి ఇచ్చారు. నేను గుమ్మం దగ్గర నిలబడే లోపలికి తొంగిచూసాను. ఆ నడివయస్సు స్త్రీ దారుణంగా విలపిస్తోంది. ఒడిలో పసిగుడ్డు వికృతంగా పడిఉంది. చుట్టూ పిల్లలు కూర్చుని కన్నీళ్ళతో అమాయకంగా తల్లి ముఖంలోకి చూస్తున్నారు. నాకు వికారంలాంటిది ఏదో కలిగింది. ఒళ్ళు తిప్పుతున్నట్టుగా అనిపించి వెనక్కి తిరిగాను. ఇంటికివచ్చేసి గుమ్మంలో తలుపుని ఆనుకుని కూర్చుండిపోయాను.

ఇది ఆలోచన్న రాత్రి! జ్ఞాపకాలరాత్రి! భయంకర రాత్రి! కాళరాత్రి! చుట్టుప్రక్కల కొన్ని ఇళ్ళల్లో దీపాలు వెలిగాయి! బద్ధకంగా అందులో కొన్ని ఆరిపోయాయి; ఆతృతగా కొన్ని అటూ ఇటూ కదుల్తున్నాయి; పోనీద్దూ మన కెందుకులే అనట్టుగా మరికొన్ని ఇళ్ళల్లో చీకటి చీకటిలాగానే ఉంది. పెంకుటింటి ముందు మనుష్యులు మరికొంచెం పెరిగారు. పెంకుటింట్లోంచివస్తున్న వెలుగు రానురాను పెద్దదై ఈ బ్రహ్మాండమంతా వ్యాపించినట్టూ ఆ వెలు

గులో నేనుకరిగి నీరై పోతున్నట్టూ.. ఏమిటో అనుభూతి! అసలేవికృతమైన ఆకొంపలో దారుణమైన ఈ సంఘటన! దరిద్రఛాయలూ, మృత్యుఛాయలూ రెండు పాయలుగా అల్లుకుని మూడో పాయగా చీకటిని కలుపుకుని ఈ విలయానికి నేలను తాకే జడ ఎవరు అల్లుతున్నారో?!! అంత కర్కోటకత్వం ఏ చేతుల్లో ఉందో! ఉండి ఉండి వీచే వేడిగాలి రివటలు తలనొప్పి పుట్టిస్తున్నాయి ఇక అక్కడకూడా ఉండలేక లోపలికి వచ్చి మంచంమీద కూలబడ్డాను. దీపం నిలిచి నిశ్చింతగా వెలుగుతోంది. పడుకున్నాను. ఏదో మగతలా క్రమ్మింది. క్షణంలో మైకం వదిలిపోయింది. లేచి గదిలో ఆ మూలనుంచి ఈమూలకు లెక్కలేనన్ని సార్లు పచార్లు చేశాను.

ఓ అరగంట గడిచింతర్వాత కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వచ్చింది.

“అసలు జబ్బేమిటో?” అన్నా ఆత్రుతగా.

సరస్వతి మాట్లాడకుండా దీపం తగ్గిస్తూ “పడుకో లేదూ” అంది.

“నే అడిగిందానికి అది జవాబు కాదు. ఎందుకు చనిపోయింది పాపాయి!” ఈ ఆఖరి “పాపాయి!” అన్న పదంలోని మృదుత్వం సరస్వతి హృదయాన్ని కరిగించింది కాబోలు “అవును పాపాయి చనిపోయింది...” వాక్యం పూర్తి చెయ్యకుండానే ఏదో ఆలోచనలో పడిపోయింది సరస్వతి క్షణం పోయింతర్వాత తనే అంది “చాలా విచిత్రమైన చావు!”

“ఏమిటా విచిత్రం?”

“అదేది...”—సరస్వతి ముఖాన్ని రెండుచేతుల్లోనూ కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. దగ్గరకి వెళ్ళి ఆ రెండుచేతులూ ముఖంనుంచి తప్పించి “విషయం ఏమిటో చెప్పకుండా అంత దుఃఖాన్నీ నువ్వే భరించటం న్యాయంగా లేదు. నేనూ పంచుకుంటాను. నాకు చెప్పటానికి సంకోచం దేనికి?” అన్నాను అనునయంగా.

నిమిషం స్తిమితపడి “ఆ పిల్లవాడు పుట్టిన కొన్ని రోజులకే తండ్రిని పోగొట్టుకున్నాడు. పదిమంది పెద్దలూ, ఇరుగుపొరుగు హితైషులూ, దగ్గరవాళ్ళం అని చెప్పుకునే బంధువులూ, నలుగురూ చేరి ఒక ఏకగ్రీవ నిర్ణయానికొచ్చి ఆమె అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే ఆమెని పూర్తిగా అందవికారిని చేసేసి, ఆ వికృతాన్ని చూసి తృప్తి అనుభవించారు వాళ్ళు. కాని దాని పర్యవసానం ఇలా పరిణమించింది. ఒక్క క్షణంలో మారిపోయిన తల్లిరూపు ఆ పసికందును దూరం చేసేసింది. తల్లి దగ్గరకు వస్తే కళ్ళు మూసుకుని ఏడ్చేవాట్ట! ఎత్తుకోబోతే కొత్తవాళ్ళని చూసినట్టుగా బిక్కముఖం వేసేవాట్ట! పాలియ్యబోతే తాగేవాడు కాట్ట! ఏదో బెంగ! నిరాహారంగా ఎంతకాలం ఉంటాడు. కృశించి కృశించి ఇవాళ శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాడు. నోరులేని పసికందు ఎంత బాధని అనుభవించాడో! అబ్బ! దారుణంగా లేదూ?”—సరస్వతి రెండు చేతుల్తోనూ ముఖాన్ని కప్పుకుని నిట్టూర్చింది.

“స్త్రీని గురించి కొత్తగా నేనేం చెప్పగలను సరస్వతీ.”—లోపల్లోపల కరిగిపోతున్నాను. ఇప్పుడు నేనూ అటువంటి పరీక్షలోనే ఉన్నాను.

బహుశా యీ సంభాషణ యింకా యిలా కొనసాగితే లోతులు పెరిగిపోతాయేమోనన్న భయంకొద్దీ “పడుకోవా, యిహ” అన్నాను.

“నాకు నిద్ర ఏం పడుతుందండీ యివాళ? ఆవిడ నెవరూ ఆదరించేవాళ్ళుకూడా లేరాయె. నేనూ వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? వెళ్ళి కాసేపుండి వస్తాను. మీరు పడుకోండి” అని జవాబుకోసం కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది నిశీధిలోకి ధైర్యంగా.

ఛీ, ఏం రాత్రి? చివరకు అదే మంచిదనుకుని మేనువాల్చి నిద్రపోయేందుకు ప్రయత్నం చేస్తున్నాను. ప్రతివారికీ ఏదో ఓ సమస్య. ఇప్పుడా స్త్రీ హృదయంలో ఏమి పెనుతుపానులు, గాలిదుమారాలు చెలరేగుతున్నాయోకద. ఆ యింటి వాతావరణం యిప్పుడెంత దుర్భరంగా వుందో ఏం చెప్పగలను?

కొంచం వత్తిగిల్లాను చూపువెళ్ళి గడియారం మీద పడింది.

చిన్నముల్లు పదకొండు మీద, పెద్దముల్లు పన్నెండుమీద నిలిచాయి. ఏదో అనుభూతి శరీరమంతా చురుక్‌మంది. విద్యుల్లతలా ఓ మెరుపు మెరిసింది మదిలో.

“మూర్ఖుడా!” అంది మనసు.

జవాబు చెప్పేందుకు ఏదీ లేదు.

ఒక రెండు నిమిషాలు సందిగ్ధానికి అతీతంగా గడిచింది కాలం. ఇప్పుడు నిశ్చయం దృఢమైంది. హఠాత్తుగా జనించే ఆలోచనల వేగం సాటిలేనిది. వాటిబలం ఆపలేనిది. తెలివిగా చేసినా, తెలివి తక్కువగా చేసినా యిది తప్పనిసరి. ఒక అపూర్వమైన మానసికావస్థ. చావో, బ్రతుకో మనిషికి తప్పనట్లే యివి చేయడమో, చేయకపోవడమో యిది జరగకుండా వుండరాదు. చేస్తే ఫలితాలకు బంగారుపూత పూయవచ్చు. సూర్యరశ్మికి ఆ బంగారుపూత మెరిస్తే ధన్యుడ్నే.

డ్రాయరు సొరుగులాగి గబగబ కాగితం, పెన్సిలు బయటకు తీశాను. కాని పెన్సిలు రాయలేదు. చెక్కాలి. ఈ మసక చీకట్లో బ్లేడుకోసం ఏం వెదకను? వెర్రి ఎత్తుతోంది. అయిదు నిమిషాల శ్రమకు ఫలితంగా సగం విరిగిన బ్లేడుముక్క కనిపించింది. దాంతో పని ప్రారంభించి, రెండు మూడుచోట్ల రెండు రక్తపు బిందువులు చిమ్మినా చివరకు పని ముగించాను. వేగంగా, వంకరటింకరగా వ్రాయదల్చుకున్నవి కాగితంపై వ్రాశాను. బల్లమీద కనపడేలావుంచి, సంచీలో రెండు మూడు బట్టలు కుక్కాను అయిదు రూపాయలనోటు జేబులోవుంది. సరిపోతుంది. తలుపు తాళం వేసి, తాళంచెవి కిటికీలో పెట్టి నేనూ అంధకారంలోకే అడుగు పెట్టాను.

*   *   *   *

సూర్యోదయం యింకా కాలేదు. చీకట్లు నెమ్మదిగా విడిపడుతున్నాయి. రైలు మందంగా సాగిపోతోంది. నిద్రలేని కళ్ళతో కిటికీలోంచి వేటినీ చూడకుండా చూస్తున్నాను. ఇతరులు చేసే సందడి నా నిశ్శబ్దతకు, ఏ కొంత చింతకు ఆటంకం కలిగించటం లేదు.

సూర్యుడు క్రమంగా మేఘాలచాటున, కొండపై ఉదయించాడు.

వందలకొద్ది ప్రయాణీకులతోబాటు నన్నూ స్టేషన్‌లో దిగవిడిచింది రైలు. దిగి చూస్తూన్నాను. ఎటుపోవాలో, ఏంచేయాలో అర్థంగాకుండా వుంది. ఓక్షణం స్తబ్ధత. తుదకు ఏ నిశ్చయంలేకుండా నే కదిలి బయటకు వచ్చాను.

ఊరు కొత్తగా లేదు. ఏణ్నార్ధక్రితం ఎలావిడిచి వచ్చానో అలానేవుంది. నారయ్య కిళ్లీదుకాణం యింకా తెరవబడలేదు. సాయంత్రులు ఆ దుకాణం ముందున్న బల్లలమీదకు పదిమందీ యింకా అలా నే పోగవుతున్నారు గావును. అదిగో సుబ్బారావు హోటలు ఆరన్నా కాకుండా జనం అప్పుడే విరగబడు తున్నారు. రోడ్డుప్రక్కనవున్న పంపులవద్ద స్త్రీలు గుమిగూడి వున్నారు. అదేవిధం. అక్కడక్కడా దెబ్బలాటలు. సరి కొత్త పాత వింతలన్నీ చూసుకుంటూ మైలున్నర నడిచాను.

అదో! అదో యిల్లు. ఏమీ మార్పు లేదు. కన్నీటి బిందువులు బరువులేక నీరసంతో ముందుకూ వెనక్కూ తటపటాయిస్తున్నాయి. అడుగులు తడబడుతున్నాయి సంశయాత్మకంగా. వెల్తురు వెనకనుంచి తరిమి కొడ్తోంది.

ముందుకు నడిచాను.

తలుపులు వేసివున్నాయి. సమీపించాను. మరి పిలవాలి. ఎవర్ని? ఇదివరలో ఎప్పుడు తలుపుతట్టినా 'అమ్మా' అని పిలిచేవాణ్ణి.

“అమ్మా” అన్నాను యిప్పుడూ అలవాటుగా, జవాబులేదు.

“అమ్మా” అన్నాను మళ్ళీ.

విరామం విసుగ్గా వుంది. లోపలసవ్వడి వినిపించింది. అడుగులు సమీపిస్తున్నాయి. నాన్న అడుగులు యింత తేలిగ్గా వుండవు. గాజులు గల గలమని ఎందుకనాలి? గుండె శక్తినంతా ఉపయోగించి, రెటింపు వేగంతో రక్తాన్ని అన్నిభాగాలకూ విరజిమ్ముతోంది. మితిమించిన నెత్తురు వేడి శరీరాన్ని మండిస్తోంది. హృదయాన్ని అదిమిపట్టుకుని నిల్చున్నాను.

తలుపులు తెరుచుకున్నాయి.

ఆత్రుతగా చూశాను. ఎదురుగా బద్ధకంగా నిలబడివున్న ఓ యువతి, యువతే, తెలివితెచ్చుకుని, చప్పున తలుపుచాటుకు చేరి “ఎవరు కావాలండీ?” అంది మధురస్వరంతో.

ఇది మాయిల్లు కాదా ఏం కర్మం ఇంతగా పొరబడటం అసంభవం విభ్రమంనుంచి నేనింకా కోలుకోలేదు. శిలావిగ్రహంలా, స్థాణువులా నిలబడ్డాను. బహుశా యోచనలతో, ఆశ్చర్యంతో యిరు హృదయాలూ ఒకేదారిని నడుస్తున్నట్లున్నాయి. గమ్యస్థానం సమీపించినట్లుంది. మెల్లిగా, మెల్లిమెల్లిగా ఓ చిరునవ్వు వెలిసింది నా పెదాలపై. “సావిత్రి” అన్నా తుదకు.

సుందరవదనం తాలూకు విశాల నేత్రాలు తలుపు చాటునుంచి తొంగిచూశాయి.

“ఎవరూ?” అంది సుందరి కంఠం. సంకోచాన్ని నిజంచేసుకుంటూన్న ధ్వనితో.

“నేనే సావిత్రీ!”

చెదిరిపోయిన జుట్టూ, బొత్తాలులేని చొక్కా, సంధ్యారుణిముకంటె ఎరుపులు వెదజల్లుతున్న త్రాగుబోతువాడికళ్ళూ, కంఠంలో అపస్వరాలూ, మరుపు తెరలచాటున మరుగుపరుస్తూ కొంతసేపు, నేనీ కొద్ది క్షణాలు ఆమెనుంచి దూరదూరంగా వుంచుతా యనటంలో సందేహంలేదు. నన్ను అన్నికోణాలనుంచీ చూచుకోవటానికి అవకాశాలు ఇస్తూ అలాగే నిలిచాను.

సంకోచం సత్యానికి దగ్గరగావచ్చింది. చివరకు “నువ్వా?”

జవాబు చెప్పకుండా లోపలకు నడిచాను. ప్రక్క గదిలోంచి నావెనగ్గా ఆమె ఎటో వెళ్ళిపోయింది. ఎదురుగా నాన్న వస్తున్నారు. సంచీ క్రిందపెట్టాను.

“ఎప్పుడూ రావటం?” నన్ను ఆకస్మికంగా చూడటంచేత ఒకింత చకితులై అడిగారు.

“ఇప్పుడే.”

"అలా వున్నావే?"

"ఏమీ లేదే?"

మాటలు వెతుక్కున్నట్లున్నారు ఓ నిమిషం. పరాజయంపొంది "అమ్మ ఆగదిలో వుంది వెళ్లు" అని ఎడమవైపు వున్న ఓగది చూపించారు, అటుకేసి నడిచాను.

మంచంమీద అమ్మ నిద్రపోతోంది. తల అటువైపు తిరిగివుంది. దౌర్భాగ్యుణ్ని అమ్మను 'అమ్మా' అని పిలిచేందుకు నోరు సిగ్గుపడి వంకర్లు తిరుతోంది. పెదాలు మరింతభయంతో వెలువడటంలేదు ఇహ తప్పని సరి అని గ్రహించాక, నా అజ్ఞానానికి నేనే చింతపడి సున్నితంగా అలికిడిచేశాను. కఠోరమైన ధ్వనితరంగాలు అమ్మకు పరిశ్రాంతి కలిగిస్తాయేమో నన్న భయంతో. ఫలించలేదు. మంచాన్ని పూర్తిగా సమీపించి, కొంచంముందుకు వంగి, ముఖంలోకి 'అమ్మా' అని పిలిచాను తెగించి.

కల అని భ్రమిస్తోందేమో, పెదాలపై చిరుహాసం చిగురిస్తోంది.

"అమ్మా" అన్నాను మళ్ళీ

ఆ అవస్థ దాటింది. ఈపిలుపులోని మృదుత్వం నరాలు కదిలించిందా? మెల్లిగా కళ్ళు విచ్చింది. అబ్బ ఇంత బలహీనంగాకూడా వుంటాయా చూపులు? ఎముకలగుట్టకన్నా ఏమీ మెరుగ్గా లేదు అమ్మ. నాన్న మాట తూచివాడారు. కాలంగడిచి కొద్దిలో ఉదయిస్తున్న సూర్యునిలా చూపు మెల్లి మెల్లిగా తేజోవంతమైంది. అది తాత్కాలికం. చిక్కిపోయిన చేతులు ముందుకు కదలటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

"నాయనా! నువ్వా?"

"వచ్చానమ్మా!"

ఇదే దృశ్యం ఇదివరకే నాకే జరిగినట్లు అనుభూతి కలుగుతోంది.

"కూర్చో."

మంచంమీద కూర్చున్నాను. నా చేతిని బలవంతంగా అందుకుని శుష్కించిపోయిన గుండెపై అదుముకుంది. అశ్రువులు బలహీనంగా, చెంపలలోని లోయలకు జారుకుంటున్నాయి.

"అమ్మా" అన్నాను ఎందుకో.

"ఇప్పటికి దయకలిగిందా?"

'దయ' అనే పదానికి యిటువంటి అర్థం తీసుకుంటే ఏం చేసేది ?

తలవంచుకు కూర్చున్నాను. పదినిమిషాలు యిలాగే కుశలప్రశ్నలు వేసింది. నేను సూటిగా జవాబుచెప్పాను. నేను సగం అయినానంది. తాను సగంలో సగం అయిందని వెంటనే నాకు స్ఫురించింది.

"దా నాయనా. మొహం కడుక్కో" అంది చివరకు. తల ఊపి యివతలకు వచ్చేశాను.

తల అంతా బరువుగా వుంది, ఎన్ని వేల క్రిమికీటకాదులో అందులో చేరిపోయినట్లు. పార్శ్వం భరించలేనంత నొప్పిగా వుంది. బావిదగ్గరకు పోతూంటే సావిత్రి మళ్ళీ ఎదుటపడింది. తప్పుకుని దారి యివ్వడం మినహా ఏమీ మాట్లాడలేదు. ముఖం కడుక్కుంటూంటే ఆలోచనలు మిన్నుముట్టాయి. ఈ వాతావరణం ఎలా భరించాలో గ్రాహ్యం కావటంలేదు. అమ్మకు ప్రమాదంగా వుందనటంలో సందేహంలేదు. నేను డాక్టర్ని కాకపోయినా మృత్యుచిహ్నాలు స్పష్టంగా ముద్ర వేసినట్లు ముఖంమీద దృగ్గోచరమైనప్పుడు, చదవగలిగే సామాన్య తెలివితేటలు భగవంతుడు యివ్వకపోలేదు. తల్లీ తండ్రీ లేని నిర్భాగ్యుడి జీవితం ఎంత క్షుద్రంగా వుంటుందో వూహించడానికికూడా బుద్ధి క్షోభిస్తోంది. "అయ్యా మా అమ్మలేదు, అమ్మా మా నాన్న లేడు. ఓ కానీ ధర్మం చెయ్యండి బాబయ్యా" అని హోటళ్ల దగ్గరా, సినిమాహాళ్ల ముందరా, రైళ్ళలో, రోడ్లు ప్రక్కా యింకా యింకా అనేకస్థలాలలో అడుక్కునే అనాథల హృదయాల్లో ఏంమెదుల్తుందో తెలియదుగాని, దానం చేసే మానవులు ఓ కానియో, మరికొంత ఎక్కువో యిచ్చేసి, అంతటితో తమ కర్తవ్యం తీరిపోయిందన్నట్లు భావించుకుని, తల్లీతండ్రీలేని అభాగ్య సోదరుడి, స్థితి ఆమాట నోరారా రోజుకు వందలసార్లు పఠించటంలో ఆ అమాయకుల గుండెలు ఎంత ద్రవించిపోతున్నాయో అని ఆలోచించకపోవటం కఠినత్వం కాదంటే, ఆ వ్యక్తి తప్పక వజ్రహృదయుడే. ఒకటో ఏట తల్లినీ రెండో ఏట తండ్రినీ పోగొట్టుకుని, బంధువులయింట్లో పెరిగి, నాకు యిప్పటికీ ప్రాణస్నేహితుడై నిలిచిన మా 'మణిని' ఎప్పుడైనా "నీ జీవితాన్ని గురించి ఆలోచించుకుంటావా?" అని నేను ఉత్కంఠతో ప్రశ్నించినప్పుడు వాడు అప్పుడు అనేక సందర్భాలలో నిర్లక్ష్యంగా నవ్వేసిన ఆ చిరునవ్వులు ఎంత విషాదాన్ని దాచుకున్నాయో యిప్పుడు తెలుస్తోంది.

ఇట్లా ఊహిస్తూ ఆ కృత్యం ముగించాక, లోపలకువచ్చి తువ్వాలకోసం వెతుకుతూంటే ఓ మృదుహస్తం కావలసిన వస్తువు అందించింది.

"థాంక్స్" అన్నా నవ్వబోయి.

మరో మృదుహస్తం కాఫీ యిచ్చింది.

ఈసారి ఆతృతను అణచుకునే శక్తి నశించి "సావిత్రీ, ఎప్పుడూ రాక ?" అన్నాను.

"నెల్లాళ్లయ్యింది. అత్తయ్యకు జబ్బుచేసినప్పటినుంచీ యిక్కడే వున్నాను." ఇలా అని అక్కడినుంచి

నిష్క్రమించబోతూండగా ఓ విషయం తోచి ఆపాను.

“ఏమిటి?”

“ఇలా వస్తే చెప్పగలను” నా ధైర్యం నాకే ఆశ్చర్యం వేసింది.

“అక్కడ్నుంచి చెప్పవచ్చు”

ఇటువంటి జవాబు వస్తుందని ఊహించలేదు కనీసం. ఎక్కడైనా నాన్న అడుగుల చప్పుళ్లు వినిపిస్తవో అని, ఆలకించి సంతృప్తిపడ్డాను. ఈ మొదటి క్షణంనుంచీ సావిత్రిముందు సిగ్గుపడటం, బలహీనుణ్ణి కావటం వగైరాలు చేసినట్లయితే యిహముందు కరుకుతనానికి యీ బొంగిలో తావులేదన్న సత్యం స్పష్టంగా కళ్ళముందు గోచరించింది.

“దగ్గరనుండి వినే విషయాలు దూరనుంచే ఎలా చెప్పమంటావు? సరే, అందుకు నువ్వు సంసిద్ధంగా వున్నావా ?”

ఆమె చప్పున బెదిరి “ఏమీవద్దు యిప్పుడు”—అక్కడినుంచి వెళ్లిపోయింది. కాఫీ త్రాగటం పూర్తయింది. ఓ నిట్టూర్పువిడిచి యీజీఛైర్‌లో కూర్చున్నాను. నాన్న అటూ యిటూ తిరుగుతూ రెండు మూడుసార్లు కనిపించాడు. ఆయన కనిపించినప్పుడల్లా శరీరంమీద ఎవరో చాటుగా చరిచినట్లు చురుక్ చురుక్ మంటోంది. సావిత్రి యిటునుంచి అటు వెళ్లింది. మధ్యలో ఓ చూపు. నా రక్తం ఆవేశంతో పొంగింది. ఈసారి ఆమెకు తగిన పాఠం నేర్పాలి.

ఆ మధ్యాహ్నం భోజనాలవేళ నాన్న కొంచెం మట్లాడారు సావిత్రి వడ్డిస్తోంది.

“వంట్లో ఆరోగ్యంగా వుంటోందా ?”

ఇక్కడ వుండగా తరుచూ దగ్గూ, జ్వరం రావటం పరిపాటి.

తల ఊపాను.

అలాగే ఆయన వేసిన రెండు మూడు ప్రశ్నలకు చేతల్లోనూ, అవసరమైతే మాటల్లోనూ జవాబు చెప్పాను. ఆ ప్రశ్నల్లోనూ, ఈ జవాబుల్లోనూ అసలు సారంలేదు. పైపెచ్చు కృత్రిమంగా వున్నట్లకూడా నాకెందుకు అనిపించాలి? చోద్యమే!

మధ్యాహ్నం బాగా నిద్రపట్టింది. అంత గట్టి నిద్రలోకూడా మనసు ఏమీ బాగుండకపోవడం నా దురదృష్టం కాకపోతే ఏమిటి ? చాలా విచిత్రమైన దశ. హృదయం కన్నీరు విడుస్తూ నేవుంది చాలా సేపటికి మెలకువచ్చింది. ఆ మెలకువ రావటంలో స్వాభావికత ఏమీ కనబడకపోయేసరికి, కళ్లకు ఏదో అడ్డుపడినట్లు కాగా, తెరిచితెరిచి చూశాను. సావిత్రిని క్రమంగా గుర్తుపట్టాను.

“మనుషులు నిద్రలోకూడా ఏడుస్తారాఏమిటి?”

నా హృదయం కన్నీరు విడిచినసంగతి ఆమెకెలా తెలుసు ?

“ఎవరు ఏడిచింది?” అని బొంకాను బింకంగా.

“ఆ కళ్లు నీవికావా ?”

సిగ్గుతో తుడుచుకుని “ఆ నీళ్లు బయటకు విరజిమ్మబడ్డాయన్నమాట” అనుకున్నాను. బదులు చెప్పలేదు.

“నా కెందుకులే” అని వేడివేడి కాఫీ యిచ్చింది.

వెళ్లిబోతూంటే ఉదయంలా ఆపి, “ఒక సందేహం తీర్చి మరీ వెళ్లు” అన్నాను.

ఆగి విసుగ్గా వున్నట్లు నటిస్తూ, ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడింది.

నానోటిమీదుగా రాబోయే ప్రశ్నను ఆమె రకరకాలుగా ఊహిస్తోందని తెలుసు. కాని ఆమె అభిప్రాయాన్ని తారుమారుచేశాను.

“అమ్మ పరిస్థితినిగురించి ఏమిటీ నీ అభిప్రాయం?

దెబ్బతిని, స్వభావాన్ని మరుగు పర్చుకుని “నాకేం తెలుసూ. డాక్టర్లు చెప్పేమాట నా చెవివరకూ రానేలేదు.”

“నలుగురూ అనుకునేమాట.”

“అదీ అంతగా తెలియదు. కాని ఒకటిమాత్రం చెప్పగలను ఆమెజబ్బు ఇహమీదట నయంకావచ్చు”.

“ఏమలా?”

“ఈ ప్రశ్నకు జవాబు నీకే తెలుసు. కాని ఆ నయంకావడం శాశ్వతంగా నిలిచిపోవని నా అనుమానం ”

బెదిరినట్లె “నీ ఉద్దేశం అంతకన్న స్పష్టంగా చెప్పకూడదా ఏం?”

ఆమె మాట్లాడకుండా వెళ్లిపోతోంది. ఆవేశంతో వెర్రిగా “సావిత్రీ!” అని పిలిచాను. ఆగలేదు వెళ్లిపోయింది.

చేసేదిలేక కాఫీని చప్పరిస్తున్నాను. సావిత్రి కలిపింది. అయినా సరస్వతి కాచినట్లే ఉంది. ఎలా అయనా వీళ్ళిద్దరికీ అట్టే భేదం లేదు.

అయిదునిమిషాలు గడిచాక “అత్తయ్య పిలుస్తోంది”-ఆమెగారి విషాదమూ, మధురమూ గాని కంఠస్వరం గది బయటనుంచి పలికింది. లేచి అమ్మ గదిలోకి వెళ్ళాను. ఆవిడ మనస్తత్వం నాకు తెలియనిది కాదాయె. మంచీ, చెడూ రెండూ కడుపులో దాచుకోలేదు. తుపానులూ, ప్రళయాలూ రేపడానికి ఆమె అట్టే వ్యవధి తీసుకోదు.

“కూర్చోరా బాబూ” అంది. ...అలాచేశాను. “సరస్వతి ఏమయిందిరా?”

అమ్మ స్వభావాన్ని ఏమాత్రం విస్మరించి వెళ్లినా హఠాత్తుగా వెలువడిన ఈ ప్రశ్నకు గుండె పగిలిపోవలసిందే. నా జాగ్రత్తలో నేను ఉన్నాను కాబట్టి బ్రతికిపోయాను. సాక్షాత్తు మాతృదేవితో ఇటువంటి...ప్రసక్తిమీద ముఖాముఖి మళ్ళీ ఓసారి మాట్లాడవలసివచ్చినందుకు నన్ను నేను ఘోరంగా నిందించుకోవడం తప్ప పెద్దశిక్ష నాకేం కనబడలేదు.

"ఏమీ కాలేదు."

"ఎందుకు వచ్చినట్లు తిరిగి?"

"నాన్న ఉత్తరం రాశారు."

"కడసారి చూసిపోదామనా?"

"అబ్బ! అవేం మాటలు?"

"మరి ఏమిటిరా?"

"ఆ విషయాలన్నీ ఈ సమయంలో మాట్లాడడానికి ఎందుకంత ఉత్సాహం కనబరుస్తావు? నీకసలే ఆరోగ్యం బావుండలేదు."

"రేపు మరీ బావుండదు. తెలివి వున్నప్పుడే మాట్లాడనియ్యి."

పలకలేక పలకలేదు.

"సరస్వతిని వదిలివేయవా?"

"అమ్మా! నీ కొడుకు చచ్చిపోవడం నీకిష్టమా?"

"కాని దిక్కులేనిచావు చావటం నాకిష్టం లేదు."

"ఏడాదిన్నర క్రితం యిదేవిషయం గురించి తల్లీ కొడుకూ, తండ్రీ కొడుకూ అన్న బాంధవ్యం, మొహమాటం, సిగ్గు విడిచి హోరాహోరీగా పోట్లాడాము. మనుషులమన్న మాట మరిచి నీచాతినీచంగా ప్రవర్తించి నలుగురిలోనూ నవ్వులపాలూ అయ్యాము. మళ్ళీ ఎందుకా ప్రళయాన్ని సృష్టించటానికి యిష్టపడతావు?"

"దాన్నిబట్టి అదే ఫలితాన్ని యిప్పుడూ సాధిస్తానని నీ తాత్పర్యమా?"

"ఏం చెప్పేది నీకు? నాకంటే ఎంతో విజ్ఞురాలివి ఈ చిన్నహృదయాన్ని నువ్వు శోధించలేకపోయావంటే మా అమ్మ యింత కఠినురాలని అనుకోమంటావా?"

"శోధించాను, నాయనా శోధించాను. నీ ఒక్క హృదయాన్నే కాదు. మరో యిద్దరినీ శోధించాను. కన్నకొడుకుమీది ప్రేమకన్న కట్టుకున్న భర్తమీది భక్తి తక్కువది కాదు. తోటి ఆడదాన్ని నీకన్న వెయ్యిరెట్లు అర్థం చేసుకోగలను. సావిత్రి ఎవరికోసం తపిస్తోందో నాకన్నా ఎక్కువగా ఎవరికీ తెలియదు."

"నిజమేనా అది? సావిత్రిస్థానంలో నే సరస్వతిని వుంచి కాస్త యోచించు నీకో అపూర్వమైన సత్యం గోచరిస్తుంది."

"యోచించానయ్యా! నా రక్తబంధువుమీద నాకున్న ప్రీతి, నా కులంమీద, హోదామీద నాకున్న మమకారం ఆ అభాగ్యురాలి ఆవేదనపట్ల నాకు కలుగుతున్న సానుభూతిని జయించాయి బాబూ!"

"అమ్మా, నువ్వు నాన్నని కానందుకు నా ఆనందాన్ని అణుచుకోలేకుండా వున్నాను. నా సంతోషం ఎలా వెలిబుచ్చేది? కాని యింత తెలిసినదానివి స్వార్థానికీ, స్వలాభానికీ లోబడిపోయావుకద."

"ఎవరికి తప్పుతుంది నాయనా ఆ అధమస్థితి? అమ్మమీదా, నాన్నమీద కల గౌరవం నిలుపుకోనా వద్దా అని నువ్వుపడిన అంతఃసంక్షోభంలో రెండో భాగానికే దాసుడివయ్యావు కాదూ?"

"కాని నా జీవితం యింకా చాలా వుంది. ఆ సంగతి ఆలోచించావా?"

"హు. నా జీవితం పరిసమాప్తి చెందబోతూంది. ఆ సంగతి నీకు తట్టటంలేదు కాబోలు?"

"అసలు నీతో వాగ్వాదానికి పూనుకోవటమే ఓ క్షమించరాని నేరం చాలా తప్పయిపోయింది" అని కన్నీళ్లతో "కాని అమ్మా నన్ను చంపకు. నువ్వయినా నన్ను అనుగ్రహించకపోతే ఏంకాను? మీ వ్యథలకూ, మనస్తాపాలకూ నేను ముమ్మాటికీ బాధ్యుడని ఒప్పుకుంటున్నాను. నీదృష్టి అంతవరకే వుంచు. కాని సావిత్రి పెంచుకున్న ఊహలకూ, వాంఛలకూ నేను బాధ్యుణ్ణి కాదు. నేను సరస్వతిని వదల్లేను. సావిత్రి జీవితంలో ఏర్పడ్డ ఖాళీకి నేను కారణుణ్ణి కాదు" అని ఆమె కాళ్లు బలంగా పట్టుకుని, వాటిమీదే తలమోపి, వెచ్చని కన్నీళ్లతో తడిపేస్తూ "ఈ పాదాలు చాలాసార్లు పట్టుకున్నాను. పరీక్షలకుపోయేముందూ, పుట్టినరోజు పండక్కీ, సరదాకి యింకా ఎన్నోసార్లు. కాని యింత దీనాతిదీనంగా, కుళ్లిపోతూ ఎప్పుడూ వీటిని స్పృశించే భాగ్యం రాలేదు. నా కోరికను మన్నించవూ?" అన్నాను.

ఏమిటది? మానవుడి అంత్యకాలంలో కూడా ఆసన్నమౌతూన్న భయంకరమైన చావును తలుచుకుని బలహీనంతో పెట్టిన చిన్న కేక, పెద్దదై, మరింత పెద్దదై, విజృంభించి యీ ప్రపంచాన్నే అలలనే హస్తాలతో నలుమూలలనుంచీ శక్తివంతంగా తన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పురుగుల్ని బంధించినట్లు బంధిస్తూంటే, భయంతో, ప్రాణాలపై తీపితో, ఒకరిపై ఒకరికిగల మమకారాల్తో, తనువుపై విసుగు జనించి, యీ ప్రళయాన్ని చూసి మమకారం పుట్టుకొచ్చిన చంచలచిత్తంతో, హడిలి చేస్తున్న హాహాకారాలు, ఆక్రందనలు మిన్నుముట్టక చిన్నదై, మరింత చిన్నదై చిరుగాలికి రేగిన మర్రిఆకు శబ్దంతో లీనమైపోతోంది. ఆకాశంనుంచి ఓనక్షత్రం రాలిపడి,

"నా తలమీదపడుతుంది," "అయ్యో మా అబ్బాయి," "నా రెండో భార్య అయ్యయ్యో" అని ఎవరికి వారు ప్రాణాలు తమకోసం, తమవారికోసం అరచేతుల్లో పెట్టుకుని ఆకాశంలోకి చూస్తూంటే అది మధ్యలోనే హరించి, అంతర్ధానమైంది. అది చుక్క కాదు. ఉల్క. భూమిపైనుంచి లేచిన ఓ జ్యోతి, తారకలా రూపుదాల్చి, చూస్తూండగానే గాలిపటమై, దారం తెగి ఎగిరిపోయింది. ఏమిటది? ఎందుకీ మసక? దూరదృష్టా? హ్రస్వదృష్టా? హఠాత్తుగా ఎందుకు యీ వృద్ధాప్యం? ఏదీ కనబడదేం? కనబడుతున్నదంతా నిజమేనా? ఆ కదిలేది ఏమిటి? ఒకటి కాదు రెండు. కాదు పది. అవును. అయిదూ అయిదూ పది. ప్రపంచంలో యింత వేగంగా కూడా కంపించే వస్తువులు వున్నాయా? శబ్దకంపన అబద్ధం వెలుగువొంపులు అబద్ధం. దీనికి, యీ ప్రత్యక్ష సత్యానికి మించింది, సరిపోయేది ఎక్కడా లేదు. లేదు. కళ్ళు తిరగటం అంటే యిదేనా ఎంతగట్టిగా అరిచినా ఎవరూ రారేం? నాలికమీంచి, కంఠంలోంచి, గుండెల్లోంచి అరుపు అరుస్తోంది.

ఓ పెద్దశబ్దం. ఓ తాకిడి.

"అమ్మా. యిదేమిటి?" వినిపించుకోదేం. కోటానుకోట్ల ప్రజలు ఏడ్చిన కన్నీళ్ళు ఒక్క కడవలోకీ సరిపోవటం లేదు. వాటి ప్రభావం అంతేనా?

"అమ్మా. యిదేమిటే?" భూమిమీద నా పాపపు యినుపపాదాలున్నాయి. పవిత్రమైన చేతులు వాటిని బంధించివేస్తున్నాయి? విదిలించుకోలేనేం? క్రూరాతిక్రూరమైన, నీచాతినీచమైన యీ సాలెగూడు సన్నివేశంనుంచీ బయటపడలేనేం? ప్రేమించిన యువతి చేతులకన్న ప్రేమించిన తల్లి చేతులు ఎంతబలమైనవి?

అది కంఠస్వరమే అయితే అందికదా "ఈ ఈ పాదాలు నీ పసితనాన ముద్దుపెట్టుకున్నాను. జబ్బు చేస్తే వొత్తాను అసహ్యం చేసుకుంటే కడిగాను. కాని బాబూ! యింత దీనాతిదీనమైనస్థితిలో, కుళ్ళిపోతూ ఎప్పుడూ వీటిని ముట్టుకోలేదురా. నాయనా నాకోరిక మన్నించు."

అయ్యో ఈ ముసలి హృదయంలో ఆ వేదనకూ, అనురాగానికీ, పట్టుదలకూ హద్దులు లేవే. ఛీ ఛీ ఛీ నా కాళ్ళు తెగనరకటానికి చక్రి ఎందుకు ఉపేక్షిస్తున్నాడు?

జారిపోతోంది ఆమె భూమిపైకి. నా శక్తినంతా కూడదీసుకుని క్రిందకు ఒంగి నా చేతుల్లోకి తీసుకున్నాను. మరీ పాపాత్ముడ్ని. బంధించిన వేళ్ళను త్రొక్కేశాను. కాని వాటిని చూడటానికి అవకాశమే లేదు. అధరాలు కదులుతున్నాయి. కళ్ళు యిందాకే మూతలు పడ్డాయి.

"ఊఁ" అను నాయనా.

ఈ ఒక్క అక్షరం చాలు. నన్ను ప్రపంచంలో తల్లక్రిందులు చేయటానికి.

"సరస్వతిని..."

ఉప్పెనలా పొంగింది దృఢ నిశ్చయం. "వొదిలివేస్తాను" అన్నాను ధీమాగా. తెగిపోయిన గాలిపటాన్ని ఎవరో అందుకున్నారు.

"సావిత్రి నే..."

"పెళ్ళాడతాను."

చైతన్యానికి అది అంత్యదశ. నా చేతుల్లో అమ్మ స్పృహ తప్పి వాల్లాడిపోయింది. గొంతంతా చించుకుని "నాన్నా! నాన్నా!! నాన్నా!!!" అని పిలిచాను. ఎవరో లోపలకు పరిగెత్తుకువచ్చారు బహుశా. నాన్న విగ్రహంలాగే కనబడింది. వారికి అప్పజెప్పి డాక్టరుకోసం పరిగెత్తాను.

* * * *

డాక్టరుగారు యిలా అన్నారు రహస్యంగా.

"ఇంకో రోజయినా గడుస్తుందో గడవదో."

కన్నీళ్లు కారలేదు. ఇందాకనే ఖర్చయిపోయాయి.

అర్ధరాత్రి దాటింది. డాబామీద నిశాచరుడిలా తిరుగుతున్నాను. నా అడుగులు చప్పుడు నాకే భయంకరంగా, వికృతంగా వినిపిస్తున్నాయి.

ఒక క్షణం ఆగాను.

అడుగుల చప్పుడూ ఆగింది.

మళ్లీ నడిచాను.

అడుగులూ వినిపిస్తున్నాయి.

రైలు చక్రాల టకటక, రైల్లో కూర్చుని మనం ఏదనుకుంటే అది పలికినట్లే యీ అడుగులూ నా ఆలోచనకు లయబద్ధంగా శ్రుతి కలుపుతున్నాయి. ఆలోచనకు గొంతు పోతోంది అయిదున్నరలో రాగాలాపన. రెండున్నరలో అడుగులు మెత్తగా శ్రుతి వేస్తున్నాయి

"అమ్మా! అమ్మా!! అమ్మా!!!"

అపశ్రుతులు లేకుండా అడుగులు స్వరాలు అందిచ్చాయి.

చీకటి అందంగా వుంది. చీకటి అసహ్యంగా వుంది. ఓహో! విభావరి ఎంత ఆనందంగా వుంది? అవునవును. దుఃఖంగా వుంది.

చీకటీ పాపమూ ఒకటే. చీకట్లో పుణ్యం చేసినా అది పాపమే. చీకటిలో నవ్వినా అది ఏడుపే. చీకటిలో ఆనందించినా అది దుఃఖమే. చీకటి అందంగా వున్నా అసహ్యమే. చీ...క...టి...లో సత్యం చెప్పినా అబద్ధమే. అబద్ధం చెప్పినా అబద్ధమే.

కాని పగలులో అబద్ధం చెప్పిన పాపానికి విలువ కట్టడం అసాధ్యం. ఆ పాపానికి పరిధులు లేకపోతే

పోనీ, దారుణంగా అబద్ధం చెప్పినమాట నిజం. ప్రపంచంలో క్షమాపణలు లేని నేరాలలో మరి ఒకటి. అమ్మ అసంతృప్తితో వెళ్ళిపోవటానికి వీలు లేదు. అంత్యదశలో, వాంఛలు తీర్చుకోవటానికి ఉబలాట పడేవారిదగ్గర, వారి మానసిక సంతృప్తికోసం ఓ అబద్ధం చెప్పటానికి ధైర్యం చేయటంలో ఘోరం ఏమీ కనబడ లేదు అప్పుడు.

జీవితంలో యింతకన్నా నీచమైన మానసికావస్థ లేదు రోజూ యింతమంది ప్రజలు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నారో యిప్పుడిప్పుడే బోధపడుతోంది. అందులో ప్రేమించిన వాళ్ళగోల దుర్భరం. లోకంలో ప్రేమకు విలువ వున్నదీ, లేదు. ప్రేమించిన వాళ్ళ అంతరంగాలు ప్రేమించినవాళ్ళనీ చదవగలగడం అనుమానాస్పదమే. ఆక్షేపణగా, హాస్యాస్పదంగా నవ్వినా నవ్వవచ్చు. ఒక ఆనందమైన అసహ్యం ప్రేమ.

ఇంతకన్నా చావే వాంఛితం.

చచ్చిపోయినవాళ్ళంతా అదృష్టవంతులు. గుండె ఆగి మరణించిన వాళ్ళు మరీ. ఈ ఉన్నతమైన కష్టపరంపరనుండి, కూర్చున్నా, నిల్చున్నా నీడకన్నా వేగంగా వెంటాడే యీ వర్ణించలేని అనుభూతులకన్న మనశ్శాంతికోసం తహతహపడి అదే శాంతిని కోల్పోవటం కన్న, నీటన్నిటినుంచీ విముక్తిచేస్తూ "యిహ నీకు ఏ బంధాలూ లేవు పో" అంటూ సర్వస్వాతంత్ర్యం ప్రసాదిస్తున్న మరణం ట్రాజెడీ అని ఎవరంటారు? ఇంతకంటె సుఖాంతం ఎక్కడవుంది?

వడగాడ్పు యీ చెవినుంచి ఆ చెవిలోకి కొడుతోంది. దాహంతో గొంతు ఆర్చుకుపోతోంది. తెలివి తప్పుతున్నట్లుగా వుంది. మరణం సన్నిహితమౌతున్నట్లుగా తోచింది కొన్ని వేల ప్రాణాలు తనలో విలీనం చేసుకున్న వడగాలి, నామీద పాశం విసురుతున్నట్లుగా వుంది. ఇలా నిల్చుంటే, కొంచం ముందుకు జరిగితే, బరువంతా ముందుకే అన్వయిస్తే చావు ఎంత సులభం!

"చావా!"

ఓ నీడ నా వైపు కదుల్తోంది ధైర్యంగా.

"సావిత్రీ!" అన్నా పిరికిగా.

"ఇక్కడ ఏం చేస్తున్నావు యిక్కడ, యింత రాత్రివేళా?"

"ఏమీ చేయలేనివారే చీకటిని కోరుకుంటారు."

ఆమె చిన్నగా నవ్వడం వినిపించింది.

"ఎందుకా నవ్వు? నన్ను చూసేనా?"

"నిన్ను చూసే ఒకరు నవ్వుతారని ఎందు కనుకోవాలి?"

జవాబు చెప్పలేదు. చప్పున ఆమె నాదగ్గరకు వచ్చేసింది. ఆమె పమిటిచెంగు గాలికి నాభుజాలు స్పృశిస్తోంది. మరుగు తెరలు ఏవో చిరుగుతున్నాయి చాలారోజుల క్రితం ఓ సంధ్యాసమయం యిలానే నిలబడ్డాము యిక్కడే. అప్పుడు వడగాలి వీచలేదు. అది మలయానిలం. కాని బాహ్యంగానే. అప్పుడు నన్ను ఏదో ప్రశ్నించబోయింది. ప్రశ్నిస్తానంది. ప్రశ్నించమన్నాను. కాని ఎంత ప్రయత్నించినా అడుగలేకపోయింది. చివరకు ఆమెను ఏకాంతానికి వదిలి నేను క్రిందకుదిగి వెళ్ళిపోయాను.

"బావా" అంది సావిత్రి.

ఎందుకో యీ పిలుపులో మధురత కనిపించటం లేదు. ఏదో క్రొత్తభావం వసుడ్ని చేసుకుంటోంది.

"అడుగు. ఏమిటె నీ ప్రశ్న?"

ఆవేశం పొంగింది. ఎంత కుటిలత్వం! ఈ ఊబిలోకి మళ్ళీ దింపటానికి కాకపోతే అర్ధరాత్రివేళ వచ్చి ఏమిచేతంతు?

క్రోధాగ్ని ప్రజ్వలించకుండా ప్రయత్నిస్తూ "వద్దులే సావిత్రి దానివల్ల నీకేం లాభంలేదు." అన్నాను

ఆమె మళ్ళీ చిన్నగా నవ్వి "నాకెందులో లాభం కలిగింది గనుక? నా సితి చూడు. నీ సందేహం విందామన్న కుతూహలంతో యింత రాత్రివేళ నీకోసం వచ్చాను" అంది.

"అడగలేను."

"సావిత్రి ముందుకూడా సంకోచమా? చిల్లిగవ్వ విలువలేని సావిత్రిముందు" ఈ సమయంలో ఎందుకూ నవ్వుతోంది? ఆ నవ్వు నల్లగా వుంది.

సరస్వతి మాటలు గుండెల్ని తొలుస్తాయి. సావిత్రి మాటలు గుండెల్ని గుచ్చుతాయి బహుశా యిదే మొదటి వ్యక్తి విజయానికి కారణమై వుంటుంది.

ఆ నవ్వు యింకా ఆగలేదు. ఇహ నా వశం కాదు. ఇటువంటి సమయం మళ్ళీ రాదు. ఈ అదృష్టానికి నన్ను నేను నిందించుకుంటే నాకంటే పిరికివాడు లేడు. ఈ అవకాశాన్ని వృథా చేసుకుంటే నాకంటే అసమర్థుడు లేడు.

"లాభంలేదు. చెప్పను"

"ఎందుకు చెప్పవ్ ఆశపెట్టి?"

నవ్వాను వెగటుగా "ఎందుకు చెప్పాలి?"

"నేను యీ రాత్రి అవమానం పొందటానికే నీ దగ్గరకు వచ్చాననుకున్నావా?"

దీనత్వం క్షణంలో మాయమైంది ఆడదానిలో. కంఠస్వరం బుసలు కొడుతోంది. నేనూ కొట్టగలను బుసబుసలు.

"అవమానం" అని మళ్ళీ వెటకారంగా నవ్వి "నా చేత అవమానం చెందటానికి అభిమానపడినదానివి దేనికి యింత ప్రయాసపడటం?" అని ఆగాను.

"ఏమిటికి నేను ప్రయాసపడ్డాను?"

'ఏమిటికో' నేను చెప్పాలన్నమాట. ఎంత నిబ్బరం; ప్రపంచంలో ఎత్తైన గోడకన్నా ఎత్తైన గోడ నా జీవితాన్ని పెనవేసుకు పెరుగుతోంది. పొమ్మన్నా పోదు. తన అసమానశక్తితో నన్ను ముక్కలు ముక్కలు చేస్తోంది. ఈ భూమ్మీద సావిత్రి అనే వ్యక్తి జన్మించకపోయినా దిగుల్లేదు. పరమాత్మునికి కృతజ్ఞతలు. ఈ అడ్డుగోడను పడద్రోయటానికి ప్రయత్నించటంలో నే నెందుకు జాలి వహించాలి? తనకు తెలియకుండా ఓ మహాపరాధాన్ని కావిస్తే ఆ అపరాధాన్ని క్షమించేందుకు కొంతవరకూ అవకాశంవుంది. కాని అలా కాదే నే పెంచుకోలేని ప్రేమ తనెందుకు పెంచుకోవాలి? ఆమెలో యీ భావం కలిగించటానికి నేనెప్పుడూ కారకుణ్ణి కాలేదు. తన ఒంటరి జీవనంతో నన్ను ఎందుకు పనికిమాలినవాణ్ణి చేయాలి? తను అమాయకురాలిగా నటిస్తూ ఓ అనాయకుడి జీవితవిధానంతో ఎందుకు చెరలాటలాడాలి? ఈ స్త్రీకి హృదయం ఉండనీ, లేకపోనీ కనీసం జ్ఞానం అయినా లేకపోయె. ఒక్క మాటతో తాను పరిపూర్ణ శాంతుణ్ని, బంధవిముక్తుణ్ణి చేయవచ్చునే.

కారుచీకటిని చూసి కోపం దమసుకోను. ఈ సన్నివేశం తీరచాలి, ఆమెకు కొంచెం దగ్గరగా జరిగి, పిట్టగోడను ఆనుకుని దర్పంగా చూపులు విరజల్లాను.

అదేమిటి? నీడ కదిలి వెళ్ళిపోతోంది.

"సావిత్రీ" అని పిలిచాను నీరసంగా.

నీడ వినిపించుకోక వెళ్ళిపోతోంది. ఆలస్యానికి తావులేదు. ఆమె నాకు దూరం కారాదు. పరుగున ఆమెను వెంబడించాను. నీడ వేగంగా, దూరంగా కదిలిపోతోంది. ఆగమని పిలిచాను వెనకనుంచి. పలకలేదు. మా యిద్దరిమధ్యా దూరం తక్కువై తక్కువై మాయమయింది. వడిగా చెయ్యి పట్టుకుని ఆపాను.

"నన్ను వెళ్ళనియ్యి. నువ్వు తిరిగి రావటంతో పరిస్థితులు చక్కబడతాయనుకున్నాను. నన్నర్థంచేసుకున్నావనుకున్నాను" అంది గాద్గదికంగా.

ఆమె హస్తాన్ని జాలిగా వొదిలి "అర్థం చేసుకున్నాను సావిత్రీ! అందుకే అమ్మకు మాటయిచ్చానని గ్రహించలేవా?" అని కొంచెం ఆగి "ఈ రాత్రివేళ నేను చెంపే ఆవేదనకు అర్థం అదికాదు" అని నిట్టూర్చాను.

"ఓహో ఏమిటే విచిత్రం!"

"నిన్ను క్షమించమని అడగటానికి నే నేమీ సంకోచించటం లేదు. గతించిన జీవితపు పుటలలో అన్నీ తప్పుడు వ్రాతలే. నన్ను క్షమించు. సావిత్రీ. మనోహరమైన యీ రాత్రినుంచి నా పాతజీవితానికి ఉద్వాసన చెబుతున్నాను. అంతా రోత. నీకింకా అర్థం కాలేదా?" అని ఆవేశంతో ఆమెచేతిని మరోమారు అందుకోబోయాను.

వదిలించుకుని "ఛీ" అంది.

"నేను యింక పరాయివాణ్ణి కాదు" అని శృతిమించబోయాను.

"మూర్ఖుడా!" అందామె రోషాయమానంగా. "ఇంతటి దుర్బలుడవా నీవు? ఈఊరుగాలి సరిపడిందా మళ్ళీ? కదేబుద్ధి వేయటంలేదా ఇక్కడున్నంత? సరస్వతిని నీకంటే నేనెక్కువ బోధపర్చుకున్నానంటే, నువ్వెందులో సిగ్గుపడాల్సింది ఏమీలేదు. అత్తయ్యకిచ్చిన మాట మాటగా నే ఉండనియ్యి. అది మంచి పని. ఆమాట అనిపించుకునేందుకు నేనింత దూరం రాలేదు. నిన్నింకా యిన్నాళ్ళూ అభినందించాను. అబ్బ నీ మనసు ఎంత చంచలం?" అని అసహ్యముగా నిట్టూర్చి "ఇప్పుడిహ ఆ పని చేయలేను. సిగ్గువిడిచి చెబుతున్నా. ఇదికూడా విను. సావిత్రి మరో వ్యక్తికి హృదయం అర్పించకపోయినా మూడోతరగతి విజ్ఞానంతో తన హద్దులు తెలుసుకుంది. నీ ప్రశ్న ఏదైనా యిదే జవాబు వర్తిస్తుంది."

నీడ బరువుగా వెళ్ళిపోతోంది. "సావిత్రీ" అని పిలిచాను బలహీనంగా.

మెట్లదగ్గర నిలుచుని "ఇంకా ఏదయినా మిగిలివుందా" అంది ఉదారంగా.

"మరి యిన్నాళ్ళూ యీ విషయం అమ్మకెందుకు చెప్పలేదు?"

"చెప్పాను. కాని నా ఏకాంతం నా మాటల్ని అబద్ధమని నమ్మేట్లుగా చేసింది."

ఇలా అని ఆమె క్రిందకుదిగి వెళ్ళిపోయింది. మైకం వదిలింది యిందాక కాదు, ఇప్పుడు. భంగపడింది నేను. తీరనికసి, తీరకుండానే అస్పృశ్యమైంది. అయినా విచారం లేదు. నాకింతకన్నా సంతృప్తి అక్కర్లేదు. సంతృప్తిని యివ్వగలిగానేమో. ఇంతకన్నా నాకు నిశ్చింత ఏముంది?

మెట్లుదిగి క్రిందకు వచ్చాను. బెడ్ లైట్ వెలుగుతోంది. చప్పుడు చేయకుండా అమ్మవున్న గదిదగ్గరకు పోయి తొంగిచూశాను. నిశ్చింతగా నిద్రపోతోంది. ఈ నిద్ర రేపటివాకామాత్రం యీ రూపంలో వుంటుంది.

కఠినుడ్నే అయినా కళ్ళు తుడుచుకుని వెనుదిరిగాను. నాన్నకూడా మంచి నిద్రలో వున్నారు. నా గదిలోకి పోతూంటగా ఏదో అనుమానం తగిలింది. మునివేళ్ళమీద వెళ్ళి సావిత్రి గదిలోనికి తొంగిచూశాను.

సావిత్రి నిశ్శబ్దంగా ఏడుస్తూంది.